ప్రజాశక్తి
బుధవారం 15 నవంబర్ 2023



28 వేల మెట్రిక్ టన్నులు చెరకు క్రషింగ్

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలం సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్‌లో 28 వేల మెట్రిక్ టన్నులు చెరకు క్రషింగ్ ఆడినట్లు మురగప్ప సంస్థ అసోసియేట్ సీనియర్ ఉపాధ్యక్షులు పట్టాభి రామ్ రెడ్డి, కేన్ ఎజిఎం రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెల 30న చెరకు క్రషింగ్ ప్రారంభించినట్లు తెలిపారు.. వాతావరణ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని చెరకు సరఫరా మందకొడిగా రావడంతో రోజువారి క్రషింగ్ సామర్థ్యం మూడు వేలకు చేపడుతున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ నుంచి చెరకు క్రషింగ్ సామర్థ్యం 3,500 నుంచి 4,000 వరకు పెంచనున్నట్లు తెలిపారు. క్రషింగ్ సీజన్లో రైతులు మట్టి లేని నాణ్యత గల చెరకు సరఫరా చేయాలని కోరారు. వచ్చే ఏడాదికి మరింత చెరకు పంటలు పండించే విధంగా యాజమాన్యం సూచించిన రకాలు ఆయానెలల్లో నాటాలన్నారు. చెరకు పంపిన వారం, పది రోజుల్లో రైతు ఖాతాల్లోకి బిల్లులు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. వీరితోపాటు హెచ్ఆర్ అండ్ మేనేజర్ మురళీకృష్ణ, ఫైనాన్షియల్ మేనేజర్ శ్యామ్ కుమార్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

- వారం రోజుల్లోనే నగదు జమ
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

ఏ ఒక్క రైతు నష్టపోకుండా, అత్యంత పకడ్బంధీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. త్వరలో ప్రారంభం కానున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకులకు స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ, సజావుగా ప్రక్రియను నిర్వహించాలని కోరారు. ఎట్టిపరిస్థితిలోనూ దళారులను, మధ్యవర్తులను దరిచేరనీయవద్దని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియ షెడ్యూలింగ్ నుంచి రసీదు ఇచ్చేవరకు ఐదు దశల్లో జరుగుతుందన్నారు. తీసుకున్న ధాన్యానికి ఎఫ్‌టిఒ తయారైన తరువాత, ఆ ధాన్యంతో రైతుకు సంబంధం ఉండదని, అక్కడినుంచి ప్రభుత్వానిదే బాధ్యత అని స్పష్టం చేశారు.

ఇ-క్రాప్ ఆధారంగానే ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. రైతులు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ ఏడాది కొన్నిచోట్ల అననుకూల వాతావరణం వల్ల పంట ఎండిపోయిందని, ఇబ్బందికర పరిస్థితి ఉందని జెసి చెప్పారు. ధాన్యం తరలించే ప్రతీ వాహనానికి జిపిఎస్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. రైతులు తామే గోనె సంచులను, వాహనాలను సమకూర్చుకుంటే, వాటి డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. కొనుగోలు పూర్తి అయిన వారం రోజుల్లోనే ధాన్యం డబ్బులు జమ చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో తాహశీల్దార్లు, ఎఒలను, నియోజకవర్గ స్థాయిలో ఎస్‌డిసిలను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఏమైనా సందేహాలు తలెత్తితే, జిల్లా అధికారులను లేదా జిల్లా స్థాయి కాల్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా పౌర సరఫరా అధికారి మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనా కుమారి, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, జిల్లా సహకార అధికారి రమేష్, మార్క్‌ఫెడ్ డిఎం విమల, ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేసిన మోసం చాలదని



- 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరిట బిజెపి ప్రచారం
- నేడు గుమ్మలక్ష్మీపురం నుంచి శ్రీకారం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చేసిన మోసం సరిపోదన్నట్టుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరో మోసకారి ప్రచారానికి తెరలేపింది. 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరిట కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే పేరుతో గిరిజనులను మభ్యపెట్టి, ఎన్నికల అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు సన్నద్ధమౌతుంది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రం నుంచి ఈ ప్రచార కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టి సుమారు తొమ్మిదిన్నరేళ్లు కావస్తున్న విషయం విధితమే. ఏటా కోటి ఉద్యోగాలు, సగటు ఆదాయం రెట్టింపు, మహిళా సాధికారత, నల్లధనం వెలికితీత, వెలికి తీసిన నల్లధనమంతా ప్రజలకు పంపకం వంటి ఎన్నో హామీలు ఇచ్చిన విషయం తెలిసిందే. వీటిలో ఏ ఒక్కటీ నెరవేరలేదు. కనీసం రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలైనా నెరవేర్చకపోతుందా అని ఎదురు చూసినవారికి నిరాశే ఎదురైంది. రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ లేదు. ఉత్తరాంధ్రకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ రెండేళ్లకే ఎత్తుగట్టారు. విశాఖ రైల్వే జోన్ ఊసేలేదు. ఉన్న వాల్తేరు డివిజన్‌కు ఎసరుపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా మన జిల్లాకు ప్రకటించిన గిరిజన విశ్వవిద్యాలయానికి నేటికీ సొంత భవన సముదాయం నిర్మించలేదు. పైగా ఉత్తరాంధ్ర గుండె చప్పుడు లాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం తహతహలాడుతోంది.

ముఖ్యంగా కొండకోనల్లో నిక్షిప్తమైవున్న బాక్సైట్, గ్రానైట్ తదితర గనులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు గిరిజనులను అడవి నుంచి దూరం చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నించింది. అందులో భాగంగానే సాలూరు మండలం తామరకొండ, పార్వతీపురంలోని బోడికొండలోని బాక్సైట్‌ను వేర్వేరు కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నించింది. సిపిఎం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన పెద్దఎత్తున పోరాడడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికీ ఇంకా బిజెపి ప్రభుత్వం నుంచి ముప్పు పొంచివుంది. అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికీ 10ఎకరాల వరకు పోడు భూములు ఇవ్వాల్సివున్నప్పటికీ బిజెపి అధికారంలోకి వచ్చాక మీనమేషాలు లెక్కిస్తోంది. మన్యం జిల్లాలో ఇంకా వేలాది గిరిజన కుటుంబాలకు సెంటు భూమి కూడా ఇవ్వలేదు. ఇచ్చిన చోట కూడా 2ఎకరాల నుంచి 2.50ఎకరాలకు మించి ఇవ్వడం లేదు. గిరిజన ప్రాంత భూములు గిరిజనేతరుల పరం కాకుండా రూపొందించిన 1/70 చట్టాలను సైతం నీరుగార్చే విధిగా అనేక బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేపెట్టింది. గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో, గిరిజనులు నిత్యం సంతల్లో దోపిడీకి గురౌతున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో దేశవ్యాప్తంగా గిరిజనుల్లో బిజెపిపై తీవ్ర వ్యతిరేకత పెరిగింది. మన జిల్లాలో బిజెపికి ఏమంత బలం లేకపోయినప్పటికీ తన రాజకీయ అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు పావులు కదుపుతోంది. అందులో భాగంగానే మన్యం జిల్లాను తొలి విడత ప్రచార జాబితాలో చేర్చింది. గిరిజనులకు చెప్పుకునేందుకు కూడా ఏమీ లేకపోవడంతో ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, ఫోషన్ శక్తి నిర్మాన్ అభియాన్, జన్‌ధన్ యోజన, ఉజ్వల తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారంతో గిరిజనులను మభ్యపెట్టేందుకు ప్రచారం చేసేందుకు సన్నద్ధమైంది.

జిల్లాకు రెండు ఐఇసి వ్యాన్లు

సంకల్ప యాత్ర కోసం మన్యం జిల్లాకు రెండు ఐఇసి వ్యాన్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అందులో అధునాతన సాంకేతిక పరికరాలతో కూడిన ఆడియో, వీడియో పరికరాలు ఉంటాయి. వాటి ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ సందేశాన్ని ప్రజలకు వినిపిస్తారు. వీటిపాటు మొత్తం 17 పథకాలతో కూడిన ప్రచార సామగ్రిని సిద్ధం చేశారు. కరపత్రాలు, బ్రోచర్లు గిరిజనులకు విరివిరిగా పంపిణీ చేసి గిరిజనులను ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఇందులో బిజెపి లేదా ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కూడా పాల్గొని వారి అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు కూడా తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలిసింది.

రోజుకు రెండు పంచాయతీల్లో ప్రచారం

రోజూ రెండు పంచాయతీల్లో సంకల్ప యాత్ర సాగే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని 27 పంచాయతీల్లో ఈనెల 15 నుండి 30 వరకు, కురుపాం మండలంలోని 23 పంచాయతీల్లో డిసెంబరు 1 నుండి 15వరకు, సీతంపేట మండలంలోని 53 పంచాయతీల్లో ఈనెల 15నుంచి డిసెంబరు 16వరకు షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తున్నట్టు ఇటీవలే కలెక్టర్ ప్రకటించారు. ఈ యాత్రలో డిపిఒ జిల్లా నోడల్ అధికారిగా, డిఎంహెచ్ఒ, డిఎస్ఒ, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు, జిల్లా వ్యవసాయఅధికారి, జిల్లా ఉద్యానఅధికారి, జిల్లా మత్స్యఅధికారి, ఐసిడిఎస్ పిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ పాల్గొంటారని సమాచారం.

వచ్చేనెల 15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

- 20 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాంగోపాల్



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 15 నుంచి జనవరి 26 తేదీ వరకు 44 రోజులపాటు ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి, సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్ తెలిపారు. మంగళవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలోగల డిఎస్ఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వివరాలను తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లతో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఐదు క్రీడా అంశాల్లో జరుగుతాయన్నారు. సచివాలయం స్థాయి, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. 15ఏళ్ల పై బడిన వయసు కలిగిన స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లను సచివాలయాల్లో ఈనెల 20 నుంచి డిసెంబర్ 10తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో విజేతలైన వారు విశాఖ పట్నంలో జనవరిలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సచివాలయం, మండల పరిధిలో విజేతలకు క్రీడా కోట్లు ఇస్తామన్నారు. నియోజకవర్గ స్థాయి లో క్రికెట్,వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు రూ.35వేలు, రెండవ స్థానానికి రూ.15వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేలు క్యాష్ ప్రైజ్ ఇస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతకు రూ.60వేలు, రెండో స్థానానికి రూ.30వేలు, మూడో స్థానం జట్టుకు రూ.10వేలు అందజేస్తారని తెలిపారు. రాష్ట్ర పోటీల్లో విజేతకు రూ.5లక్షలు, రూ.3లక్షలు, రూ.2 లక్షలు ప్రైజ్ మనీగా ఇస్తారని తెలిపారు. అన్ని క్రీడల నిర్వహణకు మెటీరియల్ ఇస్తారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రతి గ్రామంలో జరగనున్న పోటీల్లో జిల్లా ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో చీఫ్ కోచ్ అచ్యుతరావు, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

సర్వీసుల క్రమబద్ధీకరణకు సిఫార్సు చేయండి

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌కు జిసిసి గిరిజన కాంట్రాక్ట్ సేల్స్ మెన్ వినతి

ప్రజాశక్తి-విజయనగరం

గిరిజన సహకార సంస్థలో దశాబ్ద కాలానికి పైగా కాంట్రాక్టు సేల్స్ మేన్‌లుగా విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఆ సంస్థలో విధులు నిర్వహిస్తున్న గిరిజన కాంట్రాక్టు సేల్స్‌మెన్‌లు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావును కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 164 మంది గిరిజన సేల్స్‌మేన్‌లు జిసిసిలో 13 నుంచి 17 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకున్న దృష్ట్యా తమకు కూడా ఈ నిర్ణయం వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ మేరకు జిసిసి కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి.జానకిరావు ఆధ్వర్యాన ప్రతినిధి బృందం ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ ను మంగళవారం విజయనగరంలోని క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వెలువరించిన కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జిఒలోని నిబంధనల ప్రకారం తామంతా అర్హత కలిగి వున్నామని, దీనిని దృష్టిలో వుంచుకొని తమ సర్వీసుల క్రమబద్ధీకరణకు సిఫారసు చేయాలని వారు కోరారు. తమకు గత పిఆర్‌సి సిఫారుసుల మేరకు ప్రభుత్వం మినిమమ్ టైంస్కేలు వర్తింపజేసిందని తెలిపారు. సేల్స్ మేన్‌గా ప్రాథమిక కొనుగోలు కేంద్రాలు, పెట్రోలు బంక్‌లు, గ్యాస్ గోదాముల్లో, రైతుభరోసా కేంద్రాల్లో జూనియర్ అసిస్టెంట్‌లుగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఛైర్మన్ స్పందిస్తూ న్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఛైర్మన్‌ను కలసిన వారిలో సంఘం ఉపాధ్యక్షుడు జి.గోపాలరావు, కార్యదర్శి బి.రవినాయక్, జాయింట్ సెక్రటరీ ఆదినారాయణ తదితరులు వున్నారు.





జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ; విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి బయలు దేరుతున్న ఎర్ర సైనికులు


తరలి వెళ్లిన ఎర్ర సైనికులు

ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజారక్షణ భేరి పేరిట సిపిఎం విజయవాడలో బుధవారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి ఎర్ర సైనికులు తరలి వెళ్లారు. జిల్లా నుంచి బస్సులు, రైళ్లు, ప్రైవేటు వాహనాల్లో సిపిఎం శ్రేణులు వెళ్లారు. విజయనగరం నుంచి తరలి వెళ్తున్న ఎర్ర సైనికుల బస్సులను సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజారక్షణ భేరి బస్సుయాత్రలను రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి సిపిఎం నాయకులు చేపట్టారని తెలిపారు. ఈ బస్సు యాత్రలు ముగింపు సందర్భంగా బుధవారం లక్షలాది మందితో విజయవాడలో జరగనున్న బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి వెళ్తున్నారని తెలిపారవు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం దోపిడీ దారులకు అనుకూలంగా పాలన సాగిస్తున్నారు తప్ప ప్రజలు సంక్షేమం పట్టడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేయడం, కార్మిక హక్కులు కాలరాయడం, రైతుల పంటకు గిట్టు బాటు ధర లేకపోవడం, రైతుల భూములు బలవంతంగా లాగేసుకుని కార్పొరేట్లు ధారాదత్తం చేయడం వంటి అరాచక పాలన సాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు న్యాయం చేసేది, వారికి అండగా ఉండేది, అసమానతలు లేని అభివద్ధి కోసం పాటు పడేది సిపిఎం మాత్రమేనన్నారు. ఇటువంటి ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు వెళ్తున్న సిపిఎంను ప్రజలంతా బలపర్చాలని కోరారు. బహిరంగ సభలో సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ ప్రసంగిస్తారని తెలిపారు. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి రమణ, పి.శంకరరావు, ఎ.జగన్మోహన్, పి.రామ్మోహన్ సిపిఎం కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. బహిరంగ సభకు పలురైళ్లలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

విజయ నగరం నుంచి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, నాయకులు పి.రమణమ్మ, రమణ ఆధ్వర్యాన అధిక సంఖ్యలో సిపిఎం కార్యకర్తలు సొంత ఖర్చులు పెట్టుకొని రైళ్లలో విజయవాడ వెళ్లారు.


ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

కెవికె నిర్మాణం ఆపాల్సిందే..

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ
- తహశీల్దార్ కార్యాలయం వద్ద గొర్రెల మేకల పెంపకం దార్లు బైఠాయింపు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

దత్తిరాజేరు మండలంలోని చిన్న చామలాపల్లి వద్ద తలపెట్టిన కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణాన్ని నిలుపుదల చేయాల్సిందేనని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఇక్కడ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుతో గొర్రెల మేకల పెంపకందార్ల జీవనోపాధి దెబ్బతింటుందని అన్నారు. సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం తాహశీల్దార్ కార్యాలయం ఎదుట గొర్రెల మేకల వృత్తిదారులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కెవికె నిర్మాణం కోసం చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియ నిలిపివేయాలని తాహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్‌కు వినతులు ఇచ్చినప్పటికీ మొండిగా భూసేకరణకు సిద్ధం కావడం దుర్మార్గపు చర్య అన్నారు. వృత్తిదారుల జీవనోపాధిని తుంగలో తొక్కడం అంటే జీవించే హక్కును హరించడమేనని అన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో సేకరణ చేపట్టిన భూములు ఉన్నాయని, ఆయా భూముల్లో నిర్మాణం చేపట్టాలని అన్నారు. స్థానిక నాయకులు, అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రభుత్వం వెనక్కి తగ్గే విధంగా ఇక్కడ పరిస్థితులను వివరించాలని సూచించారు. చిన్న చామలాపల్లి కొండ పోరంబోకు భూమి వద్దకు వస్తే వృత్తిదారులు ఊరుకోరని, వారికి సిపిఎం అండగా ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమౌతామని, కాదని ముందుకెళ్తే రాష్ట్రస్థాయి ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


వృత్తిదారులకు అండగా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలని కోరారు. అనంతరం తాహశీల్దార్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, నాయకులు జి.శ్రీనివాస్, రాకోటి రాములు, యాదవ సంఘ నాయకులు ఎరుకు నాయుడు, తిరుపతి, పలువురు వృత్తిదారులు పాల్గొన్నారు.

మా భవిష్యత్తును కాపాడండి

గులాబీ పువ్వులతో చిన్నారుల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేయడంతో చదువుకు దూరం కాకుండా మా భవిష్యత్తును కాపాడండి అంటూ విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు ఆధ్వర్యంలో దాసన్నపేట రైతు బజార్ జంక్షన్ నుండి బాబామెట్ట ఎంఇఒ కార్యాలయం వరకు ర్యాలీ నర్విహించారు. ఎంఇఒకు పువ్వును ఇచ్చి 'మా విద్యను, మా భవిష్యత్తును కాపాడాలని విద్యార్థులు కోరారు. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ పిల్లలే దేశ భ్యవిష్యత్తు అన్నారు. దేశ మొదట ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం రోజున బాలల దినోత్సవం దేశ వ్యాప్తంగా జరుపుకుంటు న్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలోనే తగ్గాయని అన్నారు. విజయనగరం నియోజకవర్గంలో కూడా కొన్ని పాఠశాలలను ఎత్తివేయడం వల్ల చదువుకు దూరమయ్యారని అన్నారు. లక్షలాది మంది పిల్లలకు విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వమిది అన్నారు, పిల్లలకు ప్రాథమిక విద్య అందించడం భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, కానీ వారి భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడు కుంటోందని అన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


ఎంఇఒ కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నేటి బాలలే రేపటి పౌరులు

విజయనగరంటౌన్ : క్రమ శిక్షణతో పెరిగే నేటి బాలలే రేపటి సమాజానికి మంచి పౌరులు అవుతారని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అన్నారు. తన నివాసంలో బాలల దినోత్సవం నిర్వహించారు. పరిసరాల ప్రాంతాలకు చెందిన 300 బాలలు వివిధ రకాల వేషధారణలతో పాల్గొన్నారు.

ఎంచుకున్న రంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనం నిర్వహించారు. ఎస్‌పి ఎం.దీపిక ముఖ్యఅతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నెహ్రూకు పిల్లలంటే చాలా ఇష్టమని, ఆయన ఏ కార్యక్రమానికి వెళ్లినా పిల్లలను తరుచూకలుస్తూ, వారితో ముచ్చటించేవారన్నారు. విద్యార్థులు వారు ఎంచుకున్న రంగాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా స్కూల్ లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎస్‌పి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఎస్‌బి సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నర్సింహ మూర్తి, ఆర్ఐలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ శంకర్ నాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం ఎంపియుపి పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శంకర్ నాయుడును సస్పెండ్ చేస్తూ డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినుల పట్ల శంకరనాయుడు లైంగిక వేధింపులకు పాల్పడి ఘటనపై ప్రజాశక్తిలో వచ్చిన వార్తలకు అధికారులు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ స్పందించి విచారణకు ఆదేశించారు. తప్పు జరిగినట్లు తేలడంతో సస్పెండ్ చేశారు.

పైడితల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి పండగలో చివరిఘట్టం ఉయ్యాల కంబాల కార్యక్రమం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈనేపథ్యంలో ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.పలువురు భక్తులు ఘటాలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు లాంతర్లు వైపు, ఎంజి రోడ్డు వైపు చలువ పందిర్లు కింద భక్తులు భారీగా క్యూ కట్టారు.


పైడితల్లి అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు

రెటినోపతిని ప్రాథమిక దశలో గుర్తించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా వెంకటరామా ఆస్పత్రి వైష్ణవ్ ఐ కేర్ సెంటర్‌లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యాన మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మంది పైగా షుగర్, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఐ కేర్ వైద్యులు డాక్టర్ బాలి తనూజ శిబిరానికి వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ షుగర్ నియంత్రణలో లేకపోవడం వలన కంటిలో నరం దెబ్బతింటుందని అన్నారు. దానినే డయాబెటిక్ రెటినోపతి అంటారన్నారు. మొదటి దశలో గుర్తిస్తే కొన్ని రకాల మందుల ద్వారా నియత్రంచవచ్చు అన్నారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా సుగర్ మందులు వాడాలన్నారు. రెటినోపతి నిర్ధారణ అయినవారు ప్రతి రెండు నుంచి ఆరు నెలలకు ఒక్కసారి వైద్యులను కలసి కంటి చెకప్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెంకట రామా హాస్పిటల్ అధినేత డాక్టర్ చిట్టి వెంకటరమణ, ఎఒ సన్యాసిరావు, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఐదో బెటాలియన్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

డెంకాడ: ఎపిఎస్‌పి 5వ బెటాలియన్ మినిస్టీరియల్ నూతన కార్యవర్గం మంగళవారం బెటాలియన్‌లో ఎన్నికైంది. అధ్యక్షులుగా తుమ్మ మహేష్ వైస్ ప్రెసిడెంట్‌గా టి.తవిటి నాయుడు, సెక్రెటరీగా పి రవికుమార్, ట్రెజరర్‌గా కె.సత్యవతి, జాయింట్ సెక్రటరీగా ఎం. నరేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఐ. భవాని, ఇతర కార్యవర్గ సభ్యులుగా బి. గీత, సిహెచ్.సత్యనారాయణ, ఎం. గోవిందరావు, జి. అప్పారావు నియమితులయ్యారు. ఎన్నికల అధికారిగా రిటైర్ సీనియర్ అసిస్టెంట్ తాతు నాయుడు వ్యవహరించారు.

ఘనంగా బిర్సాముండా జయంతోత్సవాలు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆదివాసి స్వతంత్ర సమరయోధుడు బిర్సాముండ 149వ జయంతి ఉత్సవాలు చరిత్ర శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ బిర్సా ముండ ఆశయాలు, త్యాగాన్ని, భారత జాతి స్ఫూర్తిగా తీసుకోవాలని, 20 ఏళ్ల ప్రాయంలోనే బ్రిటిష్, తెల్ల దొరల ధమన కాండను, దోపిడీకి గురైన, సామ్రాజ్య వాదానికి ఎదురు తిరిగి, అలుపెరగని విప్లవ యుద్ధాన్ని నడిపారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపికి ఆదరణ.. వైసిపికి ఛీదరింపులు

మెంటాడ: రాష్ట్ర ప్రజలు విశేష ఆదరణ చూపుతూ టిడిపికి బ్రహ్మరథం పడితే, వైసిపి నేతలు వివిధ రూపాల్లో ప్రజల ముందుకు వెళితే ఛీదరించుకుంటున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం కంటుబుక్తవలస, వెంకంపేట గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి ఎర్రినాయుడు, జి.ముసలి నాయుడు, పల్లి సింహాద్రి, రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేట పంచాయతీ పరిధి నేరేళ్ళవలసలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు, నాయకులు కలిదిండి పాణిరాజు, బగ్గ లక్ష్మణ్, మహంతి శ్రీనివాస్ రావు, యడ్ల సూరిబాబు, భీమసేన, బగ్గ రామారావు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే మధుమేహం నివారణ

బొబ్బిలి: జాగ్రత్తలతోనే మధుమేహాన్ని నివారించవచ్చునని సిహెచ్‌సి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు, వైద్యులు కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మధుమేహానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధుమేహం వ్యాధితో ఆరోగ్యానికి చాలా ప్రమాదమన్నారు. మధుమేహం ఉన్నవారు కాళ్లకు చెప్పులు వేసుకుని బయటకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రవి శంకర్, రోజాకుమారి, స్వాతి, పాల్గొన్నారు.

దొంగతనాలపై ప్రత్యేక నిఘా

వేపాడ: నియోజకవర్గంలో జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక నిఘా పెట్టామని సిఐ బాలసూర్యారావు తెలిపారు. మండలంలోని సోంపురం జంక్షన్ వద్ద మంగళవారం ఆయన పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో వల్లంపూడి ఎస్‌ఐ కె. రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు. **భోగాపురం:** మండలంలోని జాతీయ రహదారిపై అక్కివరం పరిధిలో జంక్షన్ వద్ద భోగాపురం సిఐ బి. వెంకటేశ్వరావు వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. బైక్ పై వచ్చి మహిళల మెడలో నుంచి చైన్లను తెంపుకుపోతున్న దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని అందుకే తనిఖీలు చేపట్టామన్నారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

నెల్లిమర్ల: విద్యుత్ వినియోగదారులు పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కరించుకోవాలని వినియోగ దారుల ఫోరం చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి బి. సత్య నారాయణ సూచించారు. మంగళ వారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ సరఫరా లోపాలు, బిల్లుల లోపాలు, మీటర్ కాలిపోవడం, హై, లో ఓల్టేజ్, తదితర సమస్యలు ముందుగా మీ పరిధిలో సహాయ ఇంజనీర్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వినియోగ దారుల ఫోరం సభ్యులు ఎస్. హరి బాబు, వి. జనార్ధన రావు, రాయసం సురేంద్ర కుమార్, పాల్గొన్నారు.

రూ.1.50కోట్లతో అభివృద్ధి పనులు

మెరక ముడిదాం: మండలంలో బుధరాయవలస గ్రామంలో రూ. 1.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. గ్రామంలో ప్రతి లబ్దిదారుణకు నేరుగా సంక్షేమ ఫలాలు అందచేశామని తెలిపారు. ఈ ప్రభుత్వం చెప్పిందే తూచ తప్పకుండా నెరవేర్చే ప్రభుత్వమని, గత ప్రభుత్వంలా మోసపూరిత వాగ్దానాలు యిచ్చే ప్రభుత్వం కాదని తెలిపారు. వచ్చే ఎన్నికలలో మంత్రి బొత్స సత్యనారాయణని, వైఎస్ జగన్ మోహనరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల వెంకటరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, మండల జెసిఎస్ కన్వీనర్ కెఎస్‌ఆర్కే ప్రసాద్, సర్పంచ్ సారికి తమ్మినాయుడు, మాజీ సర్పంచ్ సరిది రమేష్, బాలి బంగారునాయుడు, బూర్లె నరేష్ కుమార్, పప్పుల క్రిష్ణ మూర్తి, సత్తారు జగన్ మోహనరావు, వైస్ ఎంపిపి టి. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజా కళాశాల విద్యార్థుల ప్రతిభ

బొబ్బిలి: విశాఖపట్నం ఎంవిఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 9,10న నిర్వహించిన సైన్స్ ఫెస్టివల్‌లో రాజా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. సైన్స్ ఫెస్టివల్‌లో ఆహారం కల్తీ–ఆరోగ్యంపై ప్రభావం అంశంపై రాజా కళాశాలకు చెందిన విద్యార్థులు కె.శరణ్య, పి.తనూజ పోస్టర్ ప్రెజెంటేషన్ నిర్వహించారు. ఆహారం కల్తీ–ఆరోగ్యంపై ప్రభావం అంశానికి ప్రథమ బహుమతి లభించడంతో విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ సుజయకృష్ణ రంగారావు, ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్, కళాశాల జాయింట్ సెక్రెటరీ బదరి అభినందించారు. ప్రథమ బహుమతి వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దిన అధ్యాపకులు ఎస్.నాగేంద్రకుమార్‌ను అభినందించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

శృంగవరపుకోట : ధర్మవరం గ్రామానికి చెందిన గిడుతూరి అప్పారావు(46) మంగళవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. తాగుడుకు బానిసైన అప్పారావును భార్య వదిలి పెట్టి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెంది ఉరి వేసుకుని చనిపోయాడు. ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

ప్రజాశక్తి – జామి

పిల్లలకు పుస్తకాలతో మానసిక ఉల్లాసం కలగడంతో పాటు సమాజ అవగాహన కలుగుతుందని ఎంఇఒ గంగరాజు అన్నారు. యాతపాలెం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రజాశక్తి ముద్రించిన బాలల చిరుమువ్వలు ప్రత్యేక సంచిక ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు జెవిఆర్‌కె ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పి సంతోషమ్మ, ఆర్ వెంకటరావు పాల్గొన్నారు.

గరివిడి: మండలంలోని రామలింగాపురం ప్రాథమికొన్నత పాఠశాలలో బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు వావిలపల్లి మోహన్ రావు, గొర్లె రమణ హాజరై గేయాలతో పిల్లలలో ఉత్సహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి ముద్రించిన చిరుమువ్వలు అనే సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు గొర్లె పద్మావతి, పాల్గొన్నారు. **బొబ్బిలి :** పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. బాలల హక్కులను కాపాడాలని వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్, కౌన్సిలర్లు కె.పెదరాములు, ఎస్.రామకృష్ణబాబు కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **డెంకాడ:** మండలంలోని అక్కివరం ఏపీ మోడల్ స్కూల్లో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాచరచన, నృత్యాలు, డిబెట్, పద్యాలు, పాటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **వేపాడ:** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలోనూ, వసతి గృహాల్లోనూ బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్, ఎస్ఒ కిరణ్మయి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆర్ ఈశ్వరరావు, జిల్లా పరిషత్ పాఠశాల



నెల్లిమర్ల: బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు; విజయనగరంలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

ఉపాధ్యాయులు, సి ఆర్ పి లు పాల్గొన్నారు. **శృంగవరపుకోట :** పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపం ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడి బంగారనాయుడు నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీనివాసరావ, నియోజకవర్గ కో అర్డినేషన్ సభ్యులు హెచ్ నానాజీ, మెంటాడ అప్పారావు, జిల్లా ఆదివాసి అధ్యక్షులు చీమల అచ్చిబాబు, పాల్గొన్నారు. **నెల్లిమర్ల:** స్థానిక ఆదిత్యా విద్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్యనారాయణ రాజు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు, వివిధ క్రీడారంగంలోనూ విద్యారంగంలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఎమ్మెల్సీ చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి. సూరిబాబు, హెచ్ఎం అమృత, పాల్గొన్నారు. **బాడంగి:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంచార్జ్ హెచ్ఎం వెంకటలక్ష్మి నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. .**రామభద్రపురం:** నాయుడు వలస పాఠశాలలో హెచ్ఎం నాగభూషణం ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు సమక్షంలో విద్యార్థులు శాంతికి సూచనగా తెల్ల బెలూన్లను ఎగురవేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, రాజ శేఖర్, బొప్పే రవి కుమార్, కృష్ణం నాయుడు, దాలినాయుడు పాల్గొన్నారు.**బొండపల్లి:** మండలంలోని కనిమెరక ప్రాథమిక పాఠశాలలో వివిధ గ్రామాల అంగన్వాడి కేంద్రాలు, వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గ్రంథాలయాధికారి బివి రమణమూర్తి, సూపర్‌వైజర్ రజిని, దుర్గ, ప్రధానోపాధ్యాయులు బి.ఈశ్వరరావు, వెంకటపతి, పాల్గొన్నారు. **విజయనగరంటౌన్ :** జెఎన్‌టియుజివిలో నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ యూనిట్, స్పార్క్ సొసైటీ, సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. వెంకటసుబ్బయ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయ సుమ, విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ ఎం. శశిభూషణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గుర్నాథ్, స్పార్క్ సొసైటీ వ్యవస్థాపకులు పి వి. పద్మనాభం,ఎన్‌జిఒ ప్రెసిడెంట్ పి. భవాని పాల్గొన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జొన్న గుడ్డి నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు రాజేష్ , వజ్రపు నవీన్ కుమార్ , ఎమ్.పవన్ కుమార్, అభిలాష్ పాల్గొన్నారు. **విజయనగరం కోట:** దేశానికి దిశా దశ నిర్దేశించేది బాలలేనని లెప్రసీ మిషన్ హీల్ ప్రాజెక్ట్ ప్రతినిధి తలాడ దీప్తి అన్నారు. లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చెల్లూరు లోని ఎంపి యుపి స్కూల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. .కార్యక్రమంలో హెచ్ఎం వై. రాము, సిడిఒ వంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మంగళవారం న్యాయవాదులు నెహ్రూ గురించి విద్యార్థులకు వివరించారు. **గంట్యాడ:** లక్కిడాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఇంఛార్జి హెచ్ఎం వాక చిన్నంనాయుడు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉప సర్పంచ్ వేసలపు నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వంగర:** స్థానిక శాఖా గ్రంథాలయం,

రబీకి సాగునీరందించలేం

స్పష్టం చేసిన మడ్డువలస ప్రాజెక్టు అధికారులు
ఎందుకు ఇవ్వరని నిలదీసిన సభ్యులు

ప్రజాశక్తి – వంగర

ఈ ఏడాది రబీకి గొర్రెల శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు అందించ లేమని మడ్డువలస ప్రాజెక్టు ఎఇ నితిన్ తెలిపారు. సాగునీరు అందించకపోతే సాగు చేసేది ఎలా అని సభ్యులు మడ్డువలస ప్రాజెక్టు అధికారులను నిలదీశారు. ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ హాజరైన ఈ సమావేశంలో పలు శాఖలపై చర్చ జరిగింది. మడ్డువలస ప్రధాన గేటు ద్వారా నాగావళి నదిలోకి సాగునీటినీ వృధాగా విడిచిపెట్టుతున్నారు కానీ ఆయకట్టుకు నీరు ఇవ్వమని ఎందుకంటున్నారని సభ్యులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎఇ నితిన్ మాట్లాడుతూ ఎస్ఇ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ మండలంలో గల నారాయణపురం ఆనకట్టుకు ఇక్కడ నుండి నీటిని విడిచి పెడుతున్నామని తెలపడంతో సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడో ఉన్న ఆనకట్టుకు ఇక్కడ నుంచి నీటిని విడిచిపెట్టడమేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సభ్యులంతా కలిసి ఇక్కడ నుండి సాగునీరు వెళ్లకుండా నిలుపుదల చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఎంపిపి సురేష్ ముఖర్జీ సమావేశంలో ప్రకటించారు. పంచాయతీరాజ్ శాఖ చర్చలో రాజుల గుమ్మడ, మడ్డువలస గ్రామాలకు చెందిన సభ్యులు మాట్లాడుతూ సిసి రోడ్లు, కాలువలకు సంబంధించిన సిమెంట్ బస్తాలు ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని మా గ్రామాలకు ఇవ్వవలసిన సిమెంటు ఎవరికిచ్చారని పిఆర్ జెఇని నిలదీశారు. వెంటనే ఎంపి చంద్రశేఖర్ జోక్యం చేసుకొని ఈ విషయంపై జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడి తమకు నివేధిక ఇవ్వాలని ఆదేశించారు. రీ సర్వే పూర్తి కాకపోవడం వల్ల వన్‌బిలు రాకపోవడంతో రైతులకు ఇబ్బంది జరుగుతుందని కింజంగి తలగాం ఎం సీతారాంపురం గ్రామాలకు చెందిన ప్రజాప్రతి నిధులు సభలో తెలియజేశారు. వైద్యశాఖ చర్చలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబందించి పలు వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సమావేశంలో కరణం సుదర్శన రావు, కిమిడి ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ శశిభూషణరావు, డిటి సుందరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరువు మండలంగా తీర్మానించండి

డెంకాడ: డెంకాడను కరువు మండలంగా ప్రకటిస్తూ తీర్మానించాలని సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎఒ నిర్మల తమ నివేదికను వినిపిస్తుండగా సభ్యులందరూ వర్షాభావ పరిస్థితి వల్ల మండలంలో వరి పంట పోయిందని రైతులందరూ నష్టపోయారని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. ఈ సమావేశానికి అధికారులు ఎక్కువ సభ్యులు తక్కువగా వచ్చారు. వచ్చిన సభ్యులు మాట్లాడుతూ మండలంలో సుమారు 5వేల ఎకరాల్లో వరి వేశారని వర్షం లేకపోవడంతో సుమారు 3,500 ఎకరాల వరకు వరి చేను ఎండిపోయిందని తెలిపారు. కరువు మండలంగా తీర్మానం చేసి ఉన్నతాధికారు లకు పంపించాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపి పిలు పిన్నింటి తమ్మి నాయుడు, కూరాకుల అనిత, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, తహశీల్దార్ ఆదిలక్ష్మి, సొసైటీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, బాలి సత్యనారాయణ, ఎంపి టిసిలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులపై సర్పంచ్ ఫిర్యాదు

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ గ్రామ రెవెన్యూ అధికారిపై సర్పంచ్ గొట్టాపు అప్పల స్వామితో పాటు టిడిపి నాయకులు మంగళవారం తహశీల్దార్ బాస్కరరావుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నెంబర్ 72లో గ్రామానికి చెందిన నిరుపేదలు గత 15 సంవత్సరాలుగా సుమారుగా 70 మంది శాశ్వత ఇండ్లు, పసువులు పాకలు వేసుకొని జీవిస్తున్నారని అయితే ఇటీవల కొంత కాలంగా గ్రామానికి చెందిన నొడగల సత్యనారాయణ అనే వ్యక్తి తన గృహంతో పాటు పసువులు షెడ్డును తొలగించాలని రెవెన్యూ అధికార్లు పదేపదే వత్తిడి చేస్తున్నారని చెప్పారు. సుమారుగా 70 కుటుంబాలు అక్కడ జీవిస్తుంటే కక్ష సాధింపుగా ఒక్క కుటుంబాన్ని మాత్రమే రెవెన్యూ అధికార్లు వత్తిడి చేయడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై స్పందించి సంబందిత రెవెన్యూ అధికార్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు, మహంతి చిన్నంనాయుడు, పతివాడ అప్పల నాయుడు, కొత్తకోట వెంకటరమణ, బొంతు రవికుమార్, చందక ఆనందరావు తదితరులు ఉన్నారు.

సర్వేపల్లి విగ్రహావిష్కరణ

పూసపాటిరేగ: మండలంలోని కనిమెళ్ల ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహావిష్కరణ చేశారు. విగ్రహాన్ని గ్రామానికి చెందిన క్రీర్తిశేషులు దుప్పాడ త్రినాద జ్ఞాపకార్థం కుటుంబీకులు పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ ఎ. రాజ్‌కుమార్, ఎస్ఐ జి. బాలకృష్ణ హాజరై మాట్లాడారు. త్రినాధ జ్ఞాపకార్థం కుటుంబీకులు పాఠశాలలో ఇటువంటి విగ్రహాలు ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు దుప్పాడ త్రినాధ బార్య జానకీ, కుమారులు సతీష్, బాలకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పథకాలే మళ్లీ గెలిపిస్తాయి : ఎమ్మెల్యే


భోగాపురం: పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి– భోగాపురం

ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలే తిరిగి తమను గెలిపిస్తాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సవరవల్లి సచివాలయం పరిధిలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పాడపేట, నందికపేట, రామదాసుపేట, పట్నా చిన్నయ్యపేట, వెంపాడపేట గ్రామాల్లో గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. అనంతరం సచివాలయంలోని పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అనూషరెడ్డి, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, పి వి.రమణ, వైస్ ఎంపిపి రావాడబాబు, నాయకులు ప్రభాకర్ రెడ్డి, పడాల శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వైసిపి ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధి జరజాపు పేట –1వ సచివాలయంలో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాల కోసం ఇబ్బందులు పడే వారని ప్రస్తుత ప్రభుత్వం అర్హులకు పథకాలు అందించడమే కాకుండా ఆయా సచివాలయాల్లో పథకాలు వివరాలు తెలుసు కోవడానికి డిజిటల్ రూపంలో బోర్డులు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారు కొండకృష్ణ, వైసిపి పట్టణ పార్టీ అధ్యక్షులు చిక్కాల సాంబ శివ రావు, కౌన్సిలర్లు నల్లి కృష్ణవేణి, పాండ్రంకి సత్యవతి, తుమ్ము భారతి తదితరులు పాల్గొన్నారు. కాగా తంగుడుబిల్లిలో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఎంపిపి అంబళ్ళ సుధారాణి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్య నారాయణ, సర్పంచ్ పి. చిన అప్పల నాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ళ శ్రీరాములు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.రామారావు పాల్గొన్నారు.

ప్రజలు వాస్తవాలను గ్రహించాలి

ప్రజాశక్తి– బొండపల్లి

గ్రామాలలో ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న వాస్తవ పరిస్థితులను ప్రజలు గ్రహించాలని ఎంపిపి చల్ల చలంనాయుడు కోరారు. మంగళ వారం కనిమెరక గ్రామ సచివాలయ ఆవరణంలో ఇంచార్జ్ ఎంపిడిఒ సి.హెచ్.సుగుణాకర్ రావు అధ్యక్షతన ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు కావలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా చలంనాయుడు మాట్లాడుతూ మరోసారి ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి జగనే కావాలని అందరు కోరుకోని ఆశీర్వదించాల న్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, వైస్ ఎంపిపి గొండెల ఈశ్వర రావు, ఎంఇఒ –2 అల్లు వెంకటరమణ, పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో నిర్వహించిన మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సంక్షేమ పథకాలకు సంబంధించిన డిజిటల్ బోర్డు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనూ ఏ రాష్ట్రంలోనూ ఏ ముఖ్య మంత్రి చేయని విధంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందే విధంగా సచివాలయాలను ప్రవేశపెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిటిసి సత్యవతి, డిసిసిబి చైర్మన్ వి చిన్న రామ నాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం కస్తూరి, వైసిపి మండల అధ్యక్షుడు జగ్గు బాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు కోరారు. మంగళవారం కొండవెలగాడలో గ్రామ వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న కొండవెల గాడలో జరిగే వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే ఈ నెల 28నన నియోజకవర్గం కేంద్రం మొయిద జంక్షన్ లో మంత్రుల సాధికార బస్సుయాత్ర జరుగుతుందని ఈ యాత్రను కూడా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు, పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి –విజయనగరం కోట

గ్రంథాలయాలతోనే విజ్ఞానం పెంపొందుతుందని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోలగట్ల శ్రావణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు, ఇంటర్నెట్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, గ్రంథాలయాలను వినియోగించుకుంటే విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. రెడ్డి పద్మావతి మాట్లాడుతూ చిన్నారులంటే నెహ్రూకు అమితమైన ప్రేమని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంఛార్జి కార్యదర్శి బోను లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు బుద్ధరాజు రామభద్రరాజు, జిల్లా గ్రంథాలయ సహాయ అధికారి కె.శ్రీనివాసరావు, బి.పద్మావతి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని వైసిపి పట్టణ నాయకులు గంటా అప్పల రాజు కోరారు. మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సంధ్యారాణి, సోషల్ వెల్ఫేర్ స్కూల్ లైబ్రరియన్ జోగులు పాల్గొన్నారు. **రేగిడి:** పిల్లలే దేశానికి ఆస్తి అని తహశీల్దార్ సుదర్శన్ రావు, ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండ్ నాగమణి అన్నారు. మంగళవారం రేగిడి శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను, బాలల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాదికారి పెంట ఈశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు. **డెంకాడ:** స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక సర్పంచ్ పి.గౌరి జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతీ దేవి నెహ్రూ చిత్ర పటాలకు పూల మాలతో అలంకరించి ప్రారంభ సభ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు మీనా, గ్రంథాలయాధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.**బాడంగి:** స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాలధికారి ఆర్. దుర్గా ప్రసాద్, పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రవిబాబు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, బాడంగి సర్పంచ్ కండి రమేష్, ఎంఇఒ రాజేశ్వరీ ముందుగా సరస్వతి దేవి చిత్ర పటానికి పూలమాలలు వేశారు. **కొత్తవలస :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయాధికారి అల్లూరి పద్మావతి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ భీమశంకర్ రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడైన ఎస్ఆర్ రంగనాధన్, ప్రభుత్వ గ్రంథాలయ ఉద్యమకారుడైన అయ్యంకి వెంకటరమణ చిత్రపటాలకి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ శ్రీరాములు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: గ్రంథాలయాలు విద్యకు నిలయాలని జిల్లా పసుగణాభివృద్ధి చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు అన్నారు. శాఖ గ్రంథాల యాధికారి పి. రామారావు అధ్యక్షతన స్థానిక గ్రంథాలయంలో మంగళవారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాలు లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సీర అప్పల నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, మాజీ విద్యాకమిటీ చైర్మన్ మంత్రి వెంకటరమణ, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, ప్రసాద్, ఎంఇఒ– 2 శ్రీనివాసరావు, ఎస్ఐ హరి బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : మండలంలోని 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు పి. నాగేశ్వర్రావు మాట్లాడుతూ వారోత్సవాలను వారం రోజులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతం కళాశాలలో.. : గ్రంథాలయ సంఘం అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ వారోత్సవాలను ప్రారంభించారు. వ్యక్తిత్వాన్ని, విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు గ్రంథాలయాన్ని వినియోగించు కోవాలని అన్నారు. ఈ సందర్భంగా బుక్ రీడర్స్ క్లబ్‌ను గురు ప్రసాద్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి ప్రారంభించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రాముఖ్యతను కళాశాల లైబ్రేరియన్ ఎల్.సత్యవతి వివరించారు.

గాజులరేగలో: గాజులరేగ శాఖా గ్రంథాలయంలో కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాఖ గ్రంథాలయ అధికారి ఎం.లక్ష్మణరావు, నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమా పాల్గొన్నారు. నారాయణ పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ మొయిద నారాయణరావు ఆధ్వర్యాన బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.